క్లుప్తంగా

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు



ఆమదాలవలస: కార్డులను పరిశీలిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ఆమదాలవలస/కొత్తూరు: బెల్ట్ షాపులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. ఆమదాలవలస పట్టణంలోని, కొత్తూరు మండల కేంద్రంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లను గురువారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. స్టేషన్ క్రైమ్ డిటెక్షన్, బైండోవర్లు, మద్యం షాపుల లైసెన్స్ ఫీజు చెల్లింపులు పరిశీలించి తగిన సూచనలు చేశారు. పాత నేరస్తులను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయించాలని సూచించారు. ఎక్సైజ్ సీఐలు సతీష్‌కుమార్, కిరణ్‌మనీశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో కీర్తన ప్రతిభ



బ్రాంజ్ మెడల్‌ను సాధించిన విద్యార్థిని కీర్తన

పొందూరు: విశాఖపట్నంలో ఇటీవల జరిగిన ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని రాపాక గ్రామానికి చెందిన ఎచ్చెర్ల కీర్తన తన ప్రతిభను కనబరిచింది. బాలికల డివిజన్ వైట్‌బెల్ట్ కేటగిరీలో కీర్తన బ్రాంజ్ మెడల్‌ను సాధించింది. విద్యార్థిని కీర్తన రాపాక ప్రాథమికోన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. ఈ సందర్భంగా విద్యార్థినికి పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నేడు పీజీ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

నరసన్నపేట: ఈ నెల 29న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సుల్లో భాగంగా ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ విభాగాల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ పి.లత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అంబేడ్కర్ యూనివర్సిటీ అధికారులు అనుమతి ఇచ్చారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పీజీలో చేరేందుకు అవకాశం ఉందని, సీట్లు పరిమితంగా ఉన్నాయన్నారు. పీజీ సెట్‌లో అర్హత సాధించకున్నా, ప్రవేశ పరీక్ష రాయకున్నా స్పాట్ అడ్మిషన్లకు రావచ్చన్నారు. ఉదయం 10 గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. సందేహాలు ఉంటే 9959354565కు ఫోన్ చేయవచ్చన్నారు.

సంప్రదాయాలను కొనసాగిద్దాం



హిందూ ధర్మ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నరసన్నపేట: అనాదిగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలు కొనసాగిస్తూ హిందూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఉభయ ప్రాంతాల మందిర అర్చక పురోహిత సంయోజక్ సియాద్రి శివశంకర్ అన్నారు. స్థానిక బంగారు వర్తకుల సంఘ భవనంలో గురువారం వీహెచ్‌పీ జిల్లా మందిర అర్చక, పురోహితుల సమావేశం నిర్వహించారు. సంస్కృతికి జీవన కేంద్రాలైన దేవాలయాల ఆధారాలను, ఆరాధనా పద్ధతులను కొనసాగించాలన్నారు. హిందూ ధర్మ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. భాస్కరబట్ల జగదీశ్వర శర్మ, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు లోకనాథం ఆనంద్, జిల్లా ధర్మ ప్రసార ప్రముఖ్ టంకాల సూరప్పడు, సమరసత విభాగ్ ప్రముఖ్ పెంట ఆటకేశం తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ



ముకుందాపురం చెరువులో చేప పిల్లలు విడిచిపెడుతున్న అధికారులు

మెళియాపుట్టి: శతశాతం సబ్సిడీతో గిరిజన రైతులకు చేప పిల్లను పంపిణీ చేస్తున్నట్లు ఎఫ్‌డీఓ మురళినాయుడు, ఐటీడీఏ ఫిష్ సీడ్ ప్రత్యేక అధికారి (ఏఈ) శ్రీకాంత్ అన్నారు. కేంద్ర ప్రత్యేక సహాయనిధులతో గిరిజన ఉప ప్రణాళిక పథకంలో భాగంగా మండలంలోని గిరిజన గ్రామాలైన ముకుందాపురం, అంపురం, ఇల్లాయిపురం నేలబొంతు, గొట్టిపల్లి గ్రామాల్లోని 27 చెరువుల్లో గురువారం చేప పిల్లలను విడుదల చేసినట్లు తెలిపారు. ఫిషరీస్ అసిస్టెంట్ సుదర్శన్, ఫీల్డ్‌మెన్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట: మండలంలో శుక్రవారం నుంచి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని నరసన్నపేట ఏఓ కె.సునీత అన్నారు. మండలంలోని తామారాపల్లిలో వీఆర్వో శ్రీనివాసరావుతో కలిసి రైతులకు వర్షాభావంపై గురువారం సూచనలు చేశారు. వరి కోతలు కోయవద్దని, పొలాల్లో కోసిన పంట ఉంటే కుప్పలుగా పెట్టాలని సూచించారు. ధాన్యం నిల్వలు ఉంటే తడవకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

నాడు–నేడు పనులకు.. గ్రహణం!



నరసన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత (బోర్డు) పాఠశాలలో నిలిచిన అదనపు తరగతి గదుల పనులు

- పాఠశాలల్లో ఎక్కడక్కడ నిలిచిన అభివృద్ధి పనులు
- నాడు–నేడు పథకానికి నిధులు నిలిపేసిన కూటమి ప్రభుత్వం
- పేరు మార్చారు.. పనులు నిలిపివేశారు..
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం చెప్పే మాటలకు చేతలకు పొంతన ఉండటం లేదు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని చెబుతూనే మరోపక్క మన బడి నాడు–నేడు పథకానికి నిధులను ఆపేసింది. పాఠశాల భవన నిర్మాణాలు అర్థాంతరంగా నిలిచిపోయాయి. విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్కారు బడుల్లో విద్యా సంస్కరణల పేరిట నాడు–నేడు పథకం అమలు చేసింది. రెండు విడతల్లో పాఠశాలలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. నరసన్నపేట నియోజకవర్గంలో మొదటి విడత దాదాపు పూర్తికాగా, రెండో విడత పనులు చాలా చోట్ల పూర్తికాలేదు. రూ.కోట్ల నిధులు వెచ్చించి అదనపు భవనాలు, ప్రహరీలు వంటి అభివృద్ధి పనులు చేపడుతూ స్కూళ్లకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. సగం పనులు పూర్తయ్యాయి. మరో రెండు నెలల్లో పనులు పూర్తవుతాయనుకున్న సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం ఏర్పడటం జరిగింది. మనబడి నాడు–నేడును.. మన బడి–మన భవిష్యత్తుగా పేరు మార్చింది. ఈ కార్యక్రమం అమలుకు అవసరమైన నిధులు మాత్రం విడుదల చేయకపోవడంతో భవన నిర్మాణాలు నిలిచిపోయాయి.



నరసన్నపేట బాలికోన్నత పాఠశాలలో ఆగిన అదనపు తరగతి భవనం పనులు



తమ్మయ్యపేట స్కూల్లో నిలిచిన ప్రహరీ పనులు

మాయమైన యాప్..

ప్రభుత్వం మారిన వెంటనే నిధులు నిలిచిపోవడంతోపాటు ఆ యాప్ కూడా మాయమైంది. నరసన్నపేట మండలంలో లుకలాం, నరసన్నపేట జిల్లా పరిషత్ (బోర్డు) స్కూల్, బాలికోన్నత పాఠశాలల్లో భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. విద్యార్థులు చాలీచాలని గదుల్లో అవస్థలు పడుతున్నారు. తమ్మయ్యపేట స్కూల్లో ప్రహరీ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నాడు–నేడు పథకంతో గత ప్రభుత్వానికి మంచి పేరు వచ్చింది. దీనిని తట్టుకోలేక కూటమి ప్రభుత్వం మొత్తం నిధులు ఆపేసిందనే విమర్శలు వస్తున్నాయి. మాపై కూటమి ప్రభుత్వానికి కక్ష ఎందుకని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. వెంటనే నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

నాడు–నేడు పనులు పూర్తిచేయాలి



గత ప్రభుత్వ కాలంలో నాడు–నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేసింది. సర్కారు బడులు రూపురేఖలు మారాయి. విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని కొనసాగించాలి. – కొన్ను శ్రీనివాసరావు, ఏబీవీపీ ప్రతినిధి, నరసన్నపేట

బ్యాంకు ఖాతాలు మార్చుతున్నాం



స్కూల్స్ అభివృద్ధికి ప్రభుత్వం మన బడి–మన భవిష్యత్తు పేరున కొత్తగా ఎన్నికైన స్కూల్ కమిటీల బ్యాంకు ఖాతాలు మార్చు చేయమంటే మార్చుతున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే ఆగిన పనులు కొనసాగిస్తాం. ప్రస్తుతం పనులు ఎంతవరకు వచ్చాయో.. ఏయే పనులకు ప్రాధాన్యత ఉందో.. ఇంకా ఎంత నిధులు అవసరమో అనేది నివేదిక తయారు చేశాం.

– యు.శాంతారావు, ఎంఈఓ, నరసన్నపేట

నరసన్నపేట నియోజకవర్గంలో రెండో విడత నాడు-నేడు పనుల వివరాలు ఇలా..				
మండలం	నరసన్నపేట	జలుమూరు	పోలాకి	సారవకోట
మంజూరైన స్కూళ్లు	34	21	37	12
మంజూరు చేసిన నిధులు	రూ.12.80 కోట్లు	రూ.11.05 కోట్లు	రూ.15.26 కోట్లు	రూ.80.80 లక్షలు

జంగిల్ తొలగింపు

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస–పురుషోత్తపురం ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలు పేరుతో ఇటీవల ప్రచురితమైన వార్తకు ఆర్అండ్‌బీ అధికారులు గురువారం స్పందించారు. జేసీబీలతో రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, పొదలు, చెట్లు తొలగించారు. తుప్పలు తొలగించడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.



శుభ్రం చేసిన తరువాత ఇలా..

నిబంధనల మేరకు ధాన్యం సేకరించాలి

నరసన్నపేట: మిల్లర్లు నిబంధనల మేరకు ధాన్యాన్ని సేకరించాలని, మిల్లుకు వచ్చిన ధాన్యానికి వెంటనే ఎకనాల్జ్‌మెంట్ ఇవ్వాలని డీఎస్‌ఓ సూర్యప్రకాశరావు సూచించారు. నరసన్నపేట, కోమర్తిలోని రైస్ మిల్లులను గురువారం పరిశీలించారు. ఓ మిల్లుల్లో ధాన్యం అన్‌లోడ్ అయినా ఇంకా ఎకనాల్జ్‌మెంట్ ఇవ్వకపోవడాన్ని గుర్తించారు. మిల్లరు ఎకనాల్జ్‌మెంట్ ఇవ్వకపోతే రైతులకు ప్రభుత్వం నుంచి డబ్బులు అందడం ఆలస్యం అవుతుందన్నారు. మిల్లులో ధాన్యం అన్‌లోడ్ అయిన వెంటనే మిల్లరు లాగిన్ నుంచి ఎకనాల్జ్‌మెంట్ ఇస్తే ప్రభుత్వానికి చేరుతుందని, ఆ వెంటనే డబ్బులు చెల్లించేందుకు వీలు అవుతుందన్నారు. అనంతరం నరసన్నపేటలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. కార్డుదారులందరికీ సరుకులు అందించాలన్నారు. తహసీల్దార్ సత్యనారాయణ, సీఎస్‌డీటీ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.



నరసన్నపేటలోని ఓ రైస్ మిల్లులో ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న డీఎస్‌ఓ, అధికారులు

ధాన్యం కొనుగోలు ఎప్పుడు?

హిరమండలం: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేస్తుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని తంప గ్రామంలో రైతులు మామిడి ఆదినారాయణ, కాళీదాస్, బి.జోగారావు, టి.అప్పయ్య, షణ్ముఖరావు తదితరులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ఎప్పుడు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కళ్లాలు, పంట పొలాల్లోనే ఉన్నాయన్నారు.



ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్న రైతులు

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

ఆమదాలవలస/బూర్జ: ఆమదాలవలస మండలంలోని పెద్దజొన్నవలస, బూర్జ మండలంలోని ఉప్పినివలస రైతు సేవా కేంద్రాల వద్ద గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రారంభించారు. బూర్జ మండలంలోని వైకుంఠపురం పంచాయతీ అల్లేపల్లిగూడ గిరిజన గ్రామంలో చేప పిల్లలు పంపిణీ చేశారు. మత్స్యశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బూర్జ: ఉప్పినివలసలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఇసుక రీచ్ పరిశీలన



ఇసుకను రాత్రి వేళ తరలిస్తే చర్యలు తీసుకుంటామని జలుమూరు తహసీల్దార్ జెన్ని రామారావు అన్నారు. గురువారం పర్లాం ఇసుక రీచ్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. రికార్డుల నిర్వహణ, అనుమతులు ఎంతవరకు ఉన్నాయి, రసీదులను సరిచూశారు. ఆర్ఐ మురళి, వీఆర్వో రామారావు, సిబ్బంది ఉన్నారు. - జలుమూరు

ఇది చెరువే..



ఈ చిత్రం కొత్తూరు మండలం బలద గ్రామానికి సమీపంలో గల 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పద్మనాభం సాగరం. ఈ చెరువు మొత్తం తామర, గుర్రపు డెక్కతో నిండిపోయి బంజరు భూమిగా కనిపిస్తుంది. ప్రభుత్వం స్పందించి ఇటువంటి పురాతనమైన సాగరాన్ని బాగుచేయాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు. - కొత్తూరు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రేయామిత్రో బుధవారం రాత్రి విశాఖపట్నం (గాజువాకలోని వినాయకనగర్)లో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేసి ఆకట్టుకుంది. శ్రేయామిత్రో ప్లేటుపై నృత్యం చేసి శభాష్ అనిపించింది. శ్రేయామిత్రోకు ఈ కార్యక్రమ నిర్వాహకులు మెమెుంటో అందించారు. ఉషోదయ కూచిపూడి కళానికేతన్ నాట్య గురువు అర్చన ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు. - పాతపట్నం

సీడ్రిల్ల్‌పై అవగాహన



సీడ్రిల్లర్‌తో మొక్కజొన్న పంటం వేయడం సులభమైన పద్ధతి అని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ హరిబాబు, ఏరియా మేనేజర్ తవిటినాయుడు అన్నారు. బూర్జ గ్రామంలో గురువారం బోగి శ్రీనివాసరావుకు చెందిన వ్యవసాయ పొలంలో సీడ్రిల్లర్‌తో ఒకేసారి మొక్కజొన్న విత్తనాలు, ఎరువులు వేశారు. ఏఓ ఎన్.శ్రీనివాసరావు, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. - బూర్జ

ఆదర్శప్రాయుడు పూలే



పాతపట్నం: ఎంజేపీ గురుకులంలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వేషధారణల్లో విద్యార్థులు

స్త్రీవిద్యను ప్రోత్సహించిన మహానుభావుడు జ్యోతీరావు పూలే అని పలువురు వక్తలు అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



ఎల్.ఎన్.పేట: మండల పరిషత్ సమావేశ మందిరంలో పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ త్రినాథులు, నాయకులు



నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ ఆరంగి మురళి, నాయకులు



పాతపట్నం: కోర్టు కూడలిలోని పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతపట్నం: పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మామిడి శ్రీకాంత్

భక్తిశ్రద్ధలతో లక్షదీపారాధన

ఎల్.ఎన్.పేట: కార్తీకమాసం సందర్భంగా ఎల్.ఎన్.పేట మండలం తాయిమాంబాపురం వంశధార పునరావాస కాలనీలో ఉన్న ఉమా కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో మహా రుద్రాభిషేకం, లక్ష దీపారాధన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివ పార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సర్పంచ్ తొత్తడి మురళీకృష్ణ (అయ్యప్ప స్వామి) ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహా రుద్రాభిషేకం నిర్వహించారు. గ్రామస్తులంతా లక్ష దీపారాధన చేశారు.



మహా రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు



లక్ష దీపారాధన

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర



సత్యసాయిబాబా చిత్రపటాన్ని తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

సారవకోట: మండల కేంద్రంలో గురువారం సత్యసాయిబాబా చిత్రపటాన్ని భక్తిశ్రద్ధలతో శోభయాత్ర నిర్వహించారు. సారవకోట, కోటబొమ్మాళి, పాతపట్నం తదితర మండలాల్లోని సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలు ఇప్పటినుంచే ప్రారంభించామని, దాంట్లో భాగంగానే ఈ శోభయాత్ర చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్తంగా..

చిన్నారులకు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పోలాకి: చిన్నారుల ఆరోగ్యం కోసమే రాష్ట్రీయ బాలస్వాస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ వెంకట్ అన్నారు. గురువారం పోలాకి పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. చిన్నారుల ఎత్తు, బరువు, ఛాతి చుట్టుకొలత, శ్వాస తీసుకుంటున్న తీరు తదితర అంశాలను పరిశీలించి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్యాధికారి శ్రీనాథ్, ఈఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొండి వైఖరి మానుకోవాలి

పోలాకి: రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు మొండి వైఖరిని మానుకోవాలని, రెసిడెన్షియల్ ట్రైనింగ్ పేరుతో ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోతున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి అన్నారు. గురువారం గుప్పెడుపేట పాఠశాలలో జరిగిన సంఘ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మన్యం జిల్లాలో జరుగుతున్న ట్రైనింగ్‌లో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ఒత్తిడితో గుండెపోటుకు గురై మృతి చెందడంపై సంఘం తరఫున సంతాపం వ్యక్తం చేశారు. వసతులు కల్పించకుండా నిబంధనలు మాత్రమే అమలు చేయటం దారుణమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినాయుడు, కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో రహదారుల అనుసంధానం

పోలాకి: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ ప్రాంత రహదారులను అనుసంధానం చేస్తున్నట్లు డ్వామా పీడీ సుధాకరరావు అన్నారు. గురువారం గొల్లవలసలో నిర్మాణంలో ఉన్న తారురోడ్డును పీడీ పరిశీలించారు. మెటీరియల్ కంపోనెంట్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సిబ్బందికి ఆదేశించారు. స్థానిక ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అంపలాంలో జరుగుతున్న గోకులం పనులను పరిశీలించారు. ఏపీఓ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

హిరమండలం: ప్రజలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎం.డి.యాసిన్ అన్నారు. మండలంలోని సుభలయ ఆర్అండ్ఆర్ కాలనీలో సంకల్ప కార్యక్రమంలో భాగంగా గురువారం మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రూ.46 వేల ఆర్థికసాయం

పాతపట్నం: మండలంలోని సీతారాంపల్లి గ్రామానికి చెందిన నీలపు చందు ఈ నెల ఒకటో తేదీన జరిగిన ప్రమాదంలో కుడి చేయికి తీవ్ర గాయాలయ్యాయి. వైద్యులు మండను తీసివేశారు. గురువారం పాతపట్నం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తామర గ్రామానికి చెందిన జావ్వాది ఈశ్వరరావు రూ.46 వేలను చందు తల్లికి అందజేశారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, మంచు కృష్ణారావు, ఎం.రామారావు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ ట్రైనింగ్ రద్దు చేయాలి

కొత్తూరు: లీడర్‌షిప్ క్వాలిటీపై ఇస్తున్న రెసిడెన్సియల్ ట్రైనింగ్‌ను రద్దుచేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దండు ప్రకాష్‌రావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాశాఖ పలు రకాల యాప్‌లు, ట్రైనింగ్‌ల పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకువస్తుందన్నారు. గజపతినగరం ట్రైనింగ్ సెంటర్‌లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా భామిని పాఠశాలకు చెందిన సిరిపురం శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందారన్నారు. మృతి చెందిన శ్రీనివాసరావు కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని యూటీఎఫ్ ప్రతినిధులు బోద శ్రీనువాసరావు, మధుసూదనరావు, విజయకుమార్ డిమాండ్ చేశారు. శ్రీనివాసరావు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణలన్నీ వేసవి సెలవుల్లో నిర్వహించాలన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

పాతపట్నం: అర్హులైన పేదలకు గృహాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ ఈఈ నర్సింగరావుతో కలిసి గురువారం సమీక్ష నిర్వహించారు. ఇటీవల తాను నిర్వహించిన ప్రజా దర్బార్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో హౌసింగ్‌కు సంబంధించి 468 దరఖాస్తులు అందాయన్నారు. పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట ఏఈలు సీతారామరాజు, గణేష్, మోహన్‌రావు, మాధవరావు, రమేష్, డీఓలు, వర్క్ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి

మెళియాపుట్టి: ఉపాధి హామీ పనులు తప్పనిసరిగా ప్రారంభించాలని మెళియాపుట్టి ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో డ్వామా పీడీ నిర్వహించిన గూగుల్ మీట్‌లో సిబ్బందితోపాటు పాల్గొన్నారు. ప్రతీ గ్రామంలో పనులు నిర్వహించాలని, పనులు చేయని క్షేత్రస్థాయి సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇస్తామని పీడీ తెలిపారు. 100 రోజులు పనిచేసిన వేతనదారుల పిల్లల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైనవారికి కంప్యూటర్, మెకానిక్, ఇతర కోర్సులు నేర్చుకోవడానికి అవకాశం ఉందన్నారు. అటువంటివారి వివరాలు తెలియజేయాలని డీఆర్‌డీఏ కో ఆర్డినేటర్ సీత అన్నారు.